
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 7 మహబూబ్‌నగర్ జిల్లా వార్తలు
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 37.0 । కనిష్ఠం : 27.0
శనివారం 11 మే 2024



స్వార్థం కోసం.. వాడుకున్నారు



మాట్లాడుతున్న పీఎం మోదీ

గెలిపించిన ప్రజలను మరిచిన బీఆర్ఎస్, కాంగ్రెస్

- రెండు నదుల మధ్యలో ఉన్న జిల్లాలో కరువుకు కారణం కాంగ్రెస్
- రుణమాఫీ చేస్తామంటూ అబద్ధపు హామీ
- నారాయణపేట జన సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ
- పదేళ్ల మోదీ పాలనలో ప్రపంచం భారత్ వైపు చూస్తోంది
- బీజేపీ ఎంపీ అభ్యర్థి, ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



మోదీకి జ్ఞాపికను అందిస్తున్న డీకే అరుణ, తదితరులు



నారాయణపేటలో జరిగిన సభకు హాజరైన ప్రజలు

మహబూబ్‌నగర్, మే 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పాలమూరు ప్రాంతాన్ని ఇక్కడి బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు స్వార్థం కోసం వాడుకున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2009లో కేసీఆర్ గెలిస్తే.. తెలంగాణ వచ్చిన తర్వాత ఆయన మరిచిపోయారని, ఇప్పుడు ఇక్కడి నుంచే సీఎంగా రేవంత్‌రెడ్డి గెలిచి హైకమాండ్‌ను మచ్చిక చేసుకునే పనిలో ఉన్నారని ఆరోపించారు. ఈ పరిస్థితి మారాలంటే పాలమూరులో డీకే అరుణను గెలిపించాలని సూచించారు. పాలమూరు ఉమ్మడి జిల్లాకు కృష్ణా, తుంగభద్ర నదుల ఆశీర్వాదం ఉందని, కానీ ఇక్కడి రైతులు దిన సరి కూలీ కోసం నేటికీ వలస పోవాల్సి వస్తోందన్నారు. ఇక్కడి ప్రాజెక్టుల కోసం రూ.లక్షల కోట్లు ఇచ్చినా.. కాంగ్రెస్ ముందుకు తీసుకెళ్లకపోవడంతో కరువుకు కారణమవుతుందని చెప్పారు. రైతు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి వారికి నమ్మక ద్రోహం చేసిందని, విశ్వాసఘాతుకానికి పాల్పడిందని ఆరోపించారు. పాలమూరులో బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థి ఫిక్సింగ్ జరిగిందని, అందుకే సీఎం రేవంత్‌రెడ్డి డీకే అరుణపై అవమానకరమైన బాష వినియోగిస్తున్నారని అన్నారు. దానికి ప్రజలు తమ ఓటు ద్వారా జవాబు చెప్పాలని సూచించారు. అంతకుముందు పార్టీ అభ్యర్థి డీకే అరుణ మాట్లాడుతూ.. ఓడిపోతామనే భయంతో, తన సీఎం పదవి పోతుందనే భావనతో డీకే అరుణ గెలువొద్దని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నారని అన్నారు. దేశమంతా మోదీని కోరుకుంటున్నారని, ఆయన ఉంటేనే పేదల బతుకులు బాగుపడతాయని వారు భావిస్తున్నారని తెలిపారు. పదేళ్లలో ప్రపంచ దేశాలు భారత్‌వైపు చూసే స్థాయికి వచ్చామన్నారు. పక్కన ఉన్న పాకిస్థాన్, చైనాలు కూడా భారత్‌పై కుట్రలు చేయకుండా మోదీ సమర్థవంతంగా పాలన చేశారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలతో మోసం చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు మళ్లీ ఐదు గ్యారెంటీల పేరుతో మోసం చేయడానికి వస్తోందని అన్నారు. అరుణమ్మను పండబెట్టి తొక్కుతా అన్న రేవంత్‌రెడ్డికి మహిళల పట్ల గౌరవం లేదని, ఆడపిల్లలపై ప్రేమ లేని దోఖేబాజ్ అని ఆరోపించారు. ఓటుకు నోటు కేసులో జైలుకు పోయి వచ్చిన దొంగ రేవంత్‌రెడ్డి అని, పదేళ్లు బీఆర్ఎస్ దోచుకుంటే.. ఇప్పుడు వచ్చిన ఈయన అంతకంటే ఎక్కువ లూటీ చేస్తున్నారని ఆరోపించారు. పాలమూరు యూనివర్సిటీకి రూ.150 కోట్ల నిధులు తెచ్చానని, రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ చేశామని, కృష్ణా-వికారాబాద్ రైల్వే లైన్‌కు నిధులు మంజూరు చేయించానని చెప్పారు. విద్యా, వైద్యరంగాల అభివృద్ధి కోసం పని చేస్తున్నామని అన్నారు. ప్రజలంతా మరోసారి మోదీ సర్కార్ రావాలని కోరుకుంటున్నారని తెలిపారు.



మాట్లాడుతున్న డీకే అరుణ

చెరువులో యువకుడి శవం లభ్యం

కొల్లాపూర్, మే 10: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ఎల్లూరు గ్రామానికి చెందిన సయీద్‌పాషా(35) శుక్రవారం కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని చుక్కాయిపల్లి ఊర చెరువులో శవమై కన్పించాడు. సయీద్‌పాషా కొన్ని రోజులుగా కొల్లాపూర్ పట్టణంలో చిత్తు కాగితాలు, సామగ్రి ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతను రెండు రోజుల నుంచి కనిపించడం లేదు. చుక్కాయపల్లి ఊర చెరువులో శవం కనిపించగా, కుటుంబ సభ్యులకు తెలిపారు. వారు వచ్చి చూసి తమ కుమారుడేనని గుర్తించారు. తల్లి షేకన్‌బీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రిషికేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

అలంపూర్ చౌరస్తా, మే 10: ఉండవల్లి మండల పరిధిలోని జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. హైవే సిబ్బంది, స్థానిక ప్రయాణికుల వివరాల మేరకు.. కర్నూలు పట్టణం, షరీఫ్‌నగర్ కాలనీకి చెందిన అజయ్, ఉమేష్‌లు ఇద్దరు కలిసి మద్యం తాగేందుకు అలంపూర్ చౌరస్తాకు వచ్చారు. మద్యం తాగి తిరిగి కర్నూలుకు వెళ్తుండగా అలంపూర్ చౌరస్తా సమీపంలో రిలయన్స్ పెట్రోల్‌బంక్ ఎదుట ముందు వెళ్తున్న ఓ కారును ఓవర్‌టెక్ చేయబోవడంతో బైక్ అదుపు తప్పి పడిపోవడంతో బైక్‌పై ఉన్న అజయ్, ఉమేష్‌ల కాళ్లకు తీవ్ర గాయలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే సిబ్బంది కర్నూలు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

జూరాల ప్రాజెక్టుకు చేరిన నీళ్లు

- గద్వాల జిల్లాకు తప్పిన మంచినీటి గండం


మిషన్ భగీరథ ఇంటెక్ వెల్‌కు పెరిగిన నీరు

గద్వాల, మే 10: నారాయణపూర్ డ్యామ్ నుంచి విడుదల చేసిన నీళ్లు జూరాల ప్రాజెక్టుకు చేరాయి. శుక్రవారం 350 క్యూసెక్యుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. దీంతో గద్వాల జిల్లాకు మంచి నీటి గండం తప్పినట్లు అయ్యింది. జూరాలలో ఉన్న నీటి నిల్వల ప్రకారం మే 15వ తేదీ వరకే మిషన్ భగీరథ నీళ్లు ఇవ్వగలమని అధికారులు తేల్చిచెప్పారు. దీంతో కలెక్టర్ ప్రభుత్వానికి పరిస్థితిని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతా కుమారి, ఇరిగేషన్ కార్యదర్శి రాహుల్ బొజ్జాలు కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి 1.9టీఎంసీల నీళ్ల విడుదలకు అంగీకరింపచేయించారు. దీంతో కర్ణాటక ఇరిగేషన్ అధికారులు నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి బుధవారం తెల్లవారుజామున 6,500క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా గురువారం అర్ధరాత్రి జూరాల ప్రాజెక్టుకు చేరుకున్నాయి. నీటి విడుదలకు ముందు జూరాలలో 2.69టీఎంసీలు ఉండగా వినియోగించుకునేందుకు 0.04టీఎంసీలు మాత్రం ఉన్నా యి. కానీ, కర్ణాటక ప్రాజెక్టు నుంచి ఇన్‌ఫ్లో వస్తుండటంతో 2.715 టీఎంసీలకు చేరగా వినియోగించుకునేందుకు 0.52టీఎంసీలకు చేరింది. దీంతో మిషన్ భగీరథ ఇంటెక్ వెల్‌కు ఫ్లో పెరుగుతుంది. ఇప్పటికే జూరాల ప్రాజెక్టులో నుంచి కాలువ తీయడంతోనే ఇంటెక్‌వెల్‌కు నీళ్లు అందుతున్నాయి. ఎట్టకేలకు కర్ణాటక నుంచి నీళ్లు రావడంతో జిల్లా ప్రజలకు మంచినీటి గండం తప్పింది.

జాతీయ ఎస్సీ కమిషన్ ఆదేశాలు అమలు చేయాలి

- పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం. రాఘవాచారి

పాలమూరు, మే 10 : జాతీయ ఎస్సీ కమిషన్ ఆదేశాలు అమలు చేస్తూ రోహిత్ వేముల బలవన్మరణానికి కారకులను శిక్షించాలని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం. రాఘవాచారి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీఎఫ్‌టీయూ కార్యాలయంలో కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన దళిత రీసర్చ్ స్కాలర్ రోహిత్ వేముల 2016జనవరి 17న వ్యవస్థీకృత హత్యకు గురైన విషయం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిందన్నారు. ప్రధానంగా సెంట్రల్ యూనివర్సిటీలో అంబేడ్కర్ భావజాలానికి ప్రాతినిత్యం వహిస్తున్న అంబేడ్కర్ స్టూడెంట్ అసోసియేషన్‌కు, ఆధిపత్య మనువాద భావజాలానికి ప్రతినిధి వ్యవహరిస్తున్న ఏబీవీపీ విద్యార్థి సంఘానికి మధ్య తలెత్తిన ఘర్షణలో యూనివర్సిటీ వీసీ అప్పారావు బీజేపీ అధికార అనుబంధ సంఘం వైపు నిలబడి దళిత విద్యార్థులను చదువు నుంచి బహిష్కరించారని తెలిపారు. అత్యున్నత విశ్వవిద్యాలయంలో దళిత విద్యార్థులు తమతో సమానంగా చదువకోవడాన్ని జీర్ణించుకోలేని అగ్రకుల విద్యార్థులు, అగ్రకుల ప్రొఫెసర్లు దళిత విద్యార్థులను అడుగడుగున కుల వివక్ష ప్రదర్శించి అవమానించారన్నారు. తదనంతరం జరిగిన పరిణామాలతో 2016జనవరి 17న రోహిత్ వేముల బలవన్మరణానికి పాల్పడ్డారని గుర్తుచేశారు. రోహిత్ మరణానంతరం ఆయన స్వగ్రామం గుంటూరు జిల్లా కలెక్టర్, స్థానిక తహసీల్దార్, జాతీయ ఎస్సీ కమిషన్ కూడా రోహిత్ దళితుడే అని 2016 ఆగస్టులోనే నివేదిక ఇచ్చారని తెలిపారు. రోహిత్ దళితుడేనని, నిందితులకు శిక్ష పడే వరకు పోరాటం ఆగదని అన్నారు. సమావేశంలో కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.చక్రవర్తి, టీఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.యం ఖలీల్, టీపీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం, ఎర్ర మోహనకృష్ణ, బెస్తశ్రీనివాస్, కూతల కృష్ణయ్య, విజయ్ పాల్గొన్నారు.


రోహిత్ వేముల ఫొటో చూపుతూ మాట్లాడుతున్న రాఘవాచారి

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

- రూ. 1.50 లక్షల నగదు, ఒక పల్సర్ బైక్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్


సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం, మే 10: పలు దొంగతనాలకు పాల్పడి పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ వివరాలను వెల్లడించారు. జడ్చర్ల పట్టణంలోని నిమ్మబావిగడ్డకు చెందిన బొంతల మూర్తి షాద్‌నగర్‌లో వాటర్‌ప్లాంట్‌లో పని చేస్తూ మొండి కృష్ణతో పరిచయం ఏర్పడింది. మొండి కృష్ణ అంతకుముందు పలు కేసుల్లో ఉండి 2013లో జైలుకు కూడా వెళ్లివచ్చాడు. అప్పటి నుంచి తరచుగా వివిధ వ్యక్తులతో కలిసి బొంతలమూర్తి పగటి సమయాల్లో ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడేవాడు.

నాగర్‌కర్నూల్ జిల్లాలోనే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని షాద్‌నగర్‌తో పాటు పెబ్బేరు, నారా యణపేట, బిజినేపల్లి, చింతకుంట ప్రాంతాల్లో 29కేసుల్లో నిందితుడుగా ఉన్నాడు. గతంలో ఆరు కేసుల్లో జైలుకెళ్లి వచ్చాడు. అతడి వద్ద నుంచి పూర్తిస్థాయిలో విచారణ జరిపి అతడితో పాటు ఇంకా ఎంతమంది దొంగ తనాలకు పాల్పడ్డారో తెలుసుకుని వారిని కఠినంగా శిక్షించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కనకయ్య, తాడూరు, తిమ్మాజిపేట, నాగర్‌కర్నూల్ ఎస్‌ఐలు, సిబ్బంది ఉన్నారు.

చెరువులో చేపలు మృతి

- రూ. 2.50లక్షల ఆస్తినష్టం


కల్వకోల్ అవృతచెరువులో మృతి చెందిన చేప పిల్లలను చూపిస్తున్న మత్స్య కార్మికులు

పెద్దకొత్తపల్లి, మే 10 : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలపరిధిలోని కల్వకోల్ గ్రామంలోని అవృత చెరువులో అనుమానాస్పద స్థితిలో చేపలు మృతి చెందాయి. ఆ గ్రామ మత్స్య కార్మిక సంఘం నాయకులు గువ్వలి వెంకటయ్య సొంత డబ్బులు రూ. 2.50లక్షలతో 50వేల చేప పిల్లలను కొనుగోలు చేసి అవృత చెరువులో వదిలాడు. శుక్రవారం ఉదయం చెరువులో చేప పిల్లలన్నీ మృతి చెంది ఉన్న విషయాన్ని బాధితుడు గుర్తించి తమ జీవనోపాధి దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశాడు. చేపలు మృతి చెందడంతో తమకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని ఆ గ్రామ మత్స్య కార్మిక సంఘం అధ్యక్షుడు అంజి, కార్యదర్శి పెబ్బేటి మల్లేష్, గువ్వలి వెంకటయ్య, గువ్వలి పెద్దయ్య, గువ్వలి కుర్మయ్య కోరారు.

టిప్పర్, కారు ఢీకొని వ్యక్తి మృతి

కృష్ణ, మే10: టిప్పర్, కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధిలోని హిందూపూర్ గ్రామ శివారులోని శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు పట్టణానికి చెందిన కారు డ్రైవర్‌తో ముగ్గరు వ్యక్తులు కలిసి యాదగిరి జిల్లా కేంద్రానికి పెళ్లి చూపుల కోసం వచ్చారు. అనంతరం తిరుగు ప్రయాణంలో హిందూపూర్ గ్రామ బసవేశ్వర ఫంక్షన్ హాల్ సమీపంలో నల్లగట్టు నుంచి కంకర లోడుతో కడెచూరు వెళ్తున్న టిప్పర్ కారును ఢీకొన్నది. దాంతో ఎయిర్ బ్యాగ్ తెరుచుకోవడం వల్ల డ్రైవర్ పక్కన ఉన్న వ్యక్తికి ఎలాంటి గాయాలు కాలేదు. వెనుక సీటులో ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అక్కడే ఉన్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి ఏఎస్‌ఐ సురేంద్రబాబు సిబ్బందితో కలిసి వెళ్లారు. తీవ్ర గాయాలతో ఉన్న వ్యక్తులను కర్ణాటక రాష్ట్ర రాయచూరు జిల్లా కేంద్రానికి తరలించారు. చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ నవీద్ అన్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి వివరాలు సేకరణ చేస్తామని ఆయన తెలిపారు.

స్విమ్మింగ్‌పూల్‌లో మునిగి బాలిక మృతి

ఉప్పునుంతల, మే10: స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు వెళ్లి నీటిలో మునిగి బాలిక మృతి చెందింది. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల కేంద్రంలో చోటుచేసుకోంది. ఏఎస్సై సుజ్ఞానం తెలిపిన వివరాల ప్రకారం.. బల్మూరు మండల పరిధిలోని కొండనాగుల గ్రామానికి చెందిన జోగు పావని(14), బాలిక అన్న శ్రీనాథ్, ఇద్దరు ఉప్పునుంతల మండల కేంద్రంలో ఉన్న పెద్దమ్మ అగు తిరుపతమ్మ ఇంటికి వచ్చారు. గురువారం మండల కేంద్రంలోని కొత్తయశోద ఫంక్షన్‌హాల్ ఉన్న స్విమ్మింగ్ పూల్‌కు జోగు పావని, అన్న శ్రీనాథ్, పెద్దమ్మ తిరుపతమ్మ ఈతకు వెళ్లారు. పావని ఈత కొడుతుండగా బెలూన్ జారిపోయి నీటిలో మునిగిపోయింది. వెంటనే కుటుంబ సభ్యులతో పాటు స్విమ్మింగ్‌పూల్ నిర్వాహకులు పావనిని బయటకు తీసి అచ్చంపేట ప్రభుత్వం ఆసుపత్రి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రానికి తరలిస్తుడంగా మార్గం మధ్యలో మృతి చెందింది. జోగు భౌరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

'అక్షయ'లో బంగారం కొనుగోళ్లపై అనాసక్తి

నారాయణపేట,మే 10: అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా పెరిగిన బంగారు ధరలతో కొనుగోలుదారులకు భారంగా మారడంతో శుక్రవారం ఆశించినంత మేర వ్యాపారం జిల్లా వ్యాప్తంగా జరగలేదు. పెరిగిన ధరలతో బంగారు విక్రయాలపై ఎఫెక్ట్ పడింది. అక్షయ తృతీయ రోజు ఎంతో కొంత బంగారం కొనుగోలు చేయాలనే సెంటిమెంట్‌తో కొందరు కేవలం రెండు మాసాల బంగారం కొనుగోళ్లకే పరిమితమయ్యారు. పది గ్రాముల బంగారం ధర రూ.72,800 పలికింది. కిలో వెండి రూ.85,750 పలికింది. ఈ నెల 9న పది గ్రాముల బంగారం ధర రూ.71,800 పలికింది. కిలో వెండి రూ.85,000 పలికింది.

వలస ఓటర్ల పరిస్థితి ఏమిటి?

- అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ పడి నాయకుల క్యాంపులు
- పార్లమెంట్ ఎన్నికల్లో కనిపించని ప్రచార ప్రభావం
- భారీగా తగ్గనున్న ఓటింగ్ శాతం...?

అచ్చంపేట, మే 10: అసెంబ్లీ ఎన్నికల హంగామా, ప్రచార ఆర్భాటం పార్లమెంట్ ఎన్నికల్లో కనిపించడం లేదు. మండలాల విస్తృత స్థాయి సమావేశాలు, ముఖ్యపట్టణాలలో రోడ్డు షోలతో నాయకులు సరిపెడుతున్నారు. ఎన్నికలకు రెండు రోజులు సమయం ఉండటంతో అచ్చంపేట నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ముఖ్యకార్యకర్తలు ఇంటింటి ప్రచారాలను నిర్వహిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వలస ఓటర్ల వివరాలను సేకరించి వారు పనిచేసే చోటనే క్యాంపులను ఏర్పాటు చేసి ఎన్నికల ప్రచారాలు నిర్వహించి ఓటర్ల రాకపోకలకు కావాల్సిన సదుపాయాలను కల్పించి భారీగా ఓటు నమోదు అయ్యేలా కృషి చేశారు. అచ్చంపేట నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,47,729 ఉన్నారు. ఈ ఓటర్లలో నూటికి 30శాతం ఓటర్లు ఇతర ప్రాంతాల్లో బతకుదెరువు కోసం వలస వెళ్లారు. దాదాపు 60వేలుపైగా ఓటర్లు తమ ఓటును వినియోగించుకునే పరిస్థితి కనిపించడం లేదు. పనులను వదులుకొని రావాలంటే ఓటర్లు అంతగా మొగ్గుచూపే పరిస్థితి కనిపించడం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం వలస ఓటర్ల చుట్టూ నాయకులు ప్రదర్శనలు చేశారు. కానీ, పార్లమెంట్ ఎన్నికలు వచ్చేసరికి నాయకత్వం వలస ఓటర్లపై అంతగా ఫోకస్ చేయడం లేదు.

డబ్బుతో ఓటును ముడిపెడుతున్న ఓటర్లు

తమను పాలించే పాలకులు ప్రజల అవసరాలకు తీర్చే నాయకుడై ఉండాలన్న అంశాన్ని ఓటరు ఎప్పుడో ప్రక్కన పెట్టాడు. పోటీలో ఉంటున్న నాయకులు ఓటరును డబ్బుతో కొనుకునే పరిస్థితిని తీసుకవచ్చారు. ఓటర్లకు డబ్బు, మద్యాన్ని ఎర చూపుతూ తమ వైపునకు తిప్పుకునే విధంగా నాయకులు అలవాటు చేశారు. ఇదే వరవడీ ప్రతీ ఎన్నికల్లో పునారావృతం అవుతుంది. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లకు కావాల్సిన ఎన్నికల సదుపాయాలు సమకూర్చకపోవడంతో ఓటరు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్న ఆలోచన చేయడం లేదు. ఈ క్రమంలో నియోజకర్గంలో ఓటింగ్ శాతం భారీగా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి.


పల్లెల్లో ప్రచారం పాల్గొన్న కార్యకర్తలు (ఫైల్)

కార్యకర్తలే నా బలగం




సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి; సభకు హాజరైన ప్రజలు

- కష్టపడ్డోళ్లకే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీలుగా పోటీ అవకాశం
- భారత్ జోడో యాత్రలో రాహుల్‌కు ఘనస్వాగతం పలకడం మరిచిపోను
- వంశీచంద్ గెలిస్తే మక్తల్ సమస్యలన్నీ పరిష్కారం
- డీకే అరుణ గెలిస్తే బంగ్లోళ్లకు న్యాయం జరుగుతుంది
- పాము వలే కాంగ్రెస్‌ను కాటేయాలని చూస్తోంది
- మక్తల్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి



వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని కోరుతున్న సీఎం

మహబూబ్‌నగర్, మే 10: కష్టపడి పనిచేసే కార్యకర్తలే తన బలగం అని, వారికే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అవకాశం ఇస్తుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికలు అయిన వెంటనే సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల ఎన్నికలు వస్తాయని చెప్పారు. ఆ ఎన్నికల్లో బూత్‌లలో మెజారిటీ తెచ్చిన కార్యకర్తలను గుర్తించి వారికే టికెట్ ఇచ్చి, పార్టీ గెలిపించుకుంటుందన్నారు. కష్టపడ్డోళ్లకు, పార్టీ జెండా మోసినోళ్లకే అవకాశం ఉంటది తప్ప.. తెల్లచొక్కాలు వేసుకుని నా చుట్టూ తిరిగి ఓట్లు తేని వారికి అవకాశం ఉండదని స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా నారాయణపేట జిల్లా మక్తల్‌లో శుక్రవారం నిర్వహించిన జనజాతర సభకు సీఎం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కళ్ల ముందు కృష్ణానది పారుతున్నా తాగు, సాగు నీటికి నోచుకోవడం లేదన్నారు. ఇన్నాళ్లు సీమాంధ్ర పాలకులను నిందించామని, అయితే తెలంగాణ రాష్ట్రంలో పదేళ్లు పాలించిన కేసీఆర్ కల్వకుర్తిని ప్రాజెక్టును పూర్తి చేయలేదని, జూరాల సామర్థ్యం పెంచలేదని, మక్తల్-నారాయణపేట, కొడంగల్ ప్రాజెక్టు చేపట్టలేదని అన్నారు. కేసీఆర్ ధన దాహానికి పాలమూరు రంగారెడ్డి పూర్తి కాలేదని విమర్శించారు. మీ బిడ్డగా ఇవ్వాళ ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేద్దామంటే ఇంటోళ్లే బయల్దేరారన్నారు. ఢిల్లీ సుల్తాన్‌లకు బానిసలుగా మారి బొజ్జో కత్తిపెట్టుకుని పాలమూరు బిడ్డను అంతమొందిస్తేనే వాళ్ల రాజ్యం నడుస్తుందని, వాళ్ల పబ్బం గడుస్తుందని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. బంగ్లా రాజకీయాలకు మీ భవిష్యత్తును మీ మాజీ శాసన సభ్యుడు తాకట్టు పెడుతున్న మాట వాస్తవం కాదా?, బీఆర్ఎస్‌ను మోసం చేసి బీజేపీకి ఓటేయాలని చెప్పడం వాస్తవం కాదా? అని మక్తల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ప్రశ్నించారు. బంగ్లా రాజకీయాల కుట్రలు, కుతంత్రాలతో మక్తల్ ప్రాంతంలో పూర్తి చేయాల్సిన మక్తల్-నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టు చేపట్టలేదన్నారు. ఈ ప్రాజెక్టు కావాలన్నా.. మక్తల్‌కు డిగ్రీ కళాశాల, మున్సిఫ్ కోర్టు, 32 గ్రామాలకు రోడ్లు కావాలన్నా, ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి ఏ లోకి మార్చాలన్నా, వాల్మీకి బోయలను ఎస్టీలో కలుపాలన్నా, మాదిగల ఏబీసీడీ వర్గీకరణ జరగాలన్నా కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌ను గెలిపించాలని కోరారు. ఈ రోజు పెను ప్రమాదం పొంచి ఉన్నదని, మీకున్న రిజర్వేషన్లను బీజేపీ రద్దు చేస్తా అంటుందని, రాజ్యాంగాన్ని మారుస్తా అంటుందన్నారు. మత చిచ్చు పెట్టి మనుషుల మధ్య విద్వేషాలు పెడతానంటున్న ఆ పార్టీ వల్ల పరిశ్రమలు, పెట్టుబడులు రాబోవన్నారు. ఈ కారణంగా యువకులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అరుణమ్మకు కాంగ్రెస్ అన్నీ ఇచ్చిందని, ఆమె మాత్రం కాంగ్రెస్‌ను చంపుతానని బయల్దేరిందన్నారు. రేవంత్ తనపై పగపట్టిండు అంటుందని, తానేందుకు పగబడతానని అన్నారు. అన్ని ఇచ్చిన కాంగ్రెస్‌పై పగబట్టింది నీవని, పాము వలే కాటేయాలని చూస్తున్నావని అన్నారు. బంగ్లా రాజకీయాలని, బంగ్లా చీకటి ఒప్పందాలను ఛేదించాలని తాను ప్రయత్నం చేస్తున్నానన్నారు. అందరం ఒక్కటై జిల్లాను అభివృద్ధి చేసుకునే అవకాశం వస్తే డీకే అరుణ అడ్డుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. భారత్ జోడో యాత్రలో భాగంగా మక్తల్ వద్ద రాహుల్ గాంధీకి లక్ష మందితో స్వాగతం పలకడం తాను మరిచిపోలేనన్నారు. ఈ రోజు పక్క నియోజకవర్గానికి ఢిల్లీ నుంచి మోదీ వచ్చి పిలిచినా నారాయణపేట వైపు కన్నెత్తి కూడా మక్తల్ బిడ్డలు చూడలేదన్నారు. మోదీ సభకు వచ్చిన జనం, మా సభకు వచ్చిన జనాల వీడియో తీసి తెలంగాణ సమాజానికి, ప్రపంచానికి మక్తల్ పౌరుషాన్ని చూయించాలని మీడియాకు విజ్ఞప్తి చేశారు. లక్ష మెజారిటీకి తగ్గకుండా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

ఈ ఎన్నిక పాలమూరు భవిష్యత్తుకు సంబంధించినది: వంశీచంద్‌రెడ్డి

ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నిక పాలమూరు భవిష్యత్తుకు సంబంధించిన ఎన్నిక అని ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. వ్యక్తుల మధ్యనో, పార్టీల మధ్యనో జరుగుతున్న ఎన్నికగా భావిస్తే పాలమూరుకు తీరని అన్యాయం చేసిన వారమవుతామని చెప్పారు. భవిష్యత్తు తరాలకు సంబంధించిన ఎన్నిక అని చెప్పారు. పాలమూరుకు వెన్నుపోటు పొడిచే శక్తులకు ఓటు వేయొద్దని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఏకమై పని చేస్తున్నాయన్నారు. పదేళ్లు మనలను బానిసలుగా చూశారన్నారు. మక్తల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఇక్కడికి వచ్చారని, ఈ గెలుపుతో ఆయన బలాన్ని ఢిల్లీలో పెంచినవారం అవుతామని చెప్పారు. ఇది పాలమూరు ఆత్మగౌరవానికి సంబంధించిన ఎన్నిక అని అన్నారు. సమయాభావం వల్ల ప్రతీ ఇంటికి, ప్రతీ ఓటరును కలిసే అవకాశం రాలేదని, తనను మీ బిడ్డగా భావించి ఆశీర్వదించాలని కోరారు.

నేటితో ఎన్నికల ప్రచారానికి తెర

- మూగబోనున్న మైక్‌లు
- పాలమూరు పార్లమెంట్ బరిలో 31 మంది
- నాగర్‌కర్నూల్‌లో 19 మంది పోటీ
-నేటి సాయంత్రం నుంచి 48 గంటల పాటు మద్యం దుకాణాలు బంద్

మహబూబ్‌నగర్, మే 10: నెల రోజులుగా హోరాహోరీగా సాగిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి శనివారంతో తెరపడనుంది. శనివారం సాయంత్రం ఐదు గంటలకు ఎక్కడికక్కడ ప్రచారం ఆగిపోనుంది. రోడ్ల వెంట చెవులు చిల్లులు పడేలా పాటలతో హోరెత్తిస్తున్న నాయకుల ప్రచార రథాలు ఆగిపోనున్నాయి. పార్లమెంట్ ఎన్నికలకు గత నెల 18న నోటిఫికేషన్ విడుదల కాగా, అంతకు ముందు నుంచే జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలతోపాటు స్వతంత్రులు కూడా ప్రచారం చేశారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానాన్ని అన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఇక్కడ మొత్తం 31 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో 19 మంది పోటీ చేస్తున్నారు. నాయకులు, వారి మద్దతుదారులు మండే ఎండను లెక్కచేయకుండా ప్రచారం చేస్తున్నారు. వారికి మద్దతుగా పార్టీల ముఖ్య నాయకులు ప్రచారానికి తరలి వచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాగర్‌కర్నూల్, నారాయణపేటలో బహిరంగ సభల్లో పాల్గొనగా కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా రాహుల్‌గాంధీ ఎర్రవల్లి చౌరస్తాలో సభ నిర్వహించారు. ఇక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్లమెంట్ పరిధిలో తొమ్మిదిసార్లు పర్యటించారు. అభ్యర్థుల నామినేషన్లకు హాజరు కావడంతోపాటు పలు నియోజకవర్గాల్లో కార్నర్ మీటింగ్‌లు, సభలు నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతుగా మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌లో రోడ్‌షోలు నిర్వహించి, కార్నర్ మీటింగ్‌లలో పాల్గొన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ప్రచారానికి చివరి రోజు శనివారం వనపర్తికి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రానున్నారు. ప్రచారం ముగిశాక ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు పార్టీల నాయకులు చివరి రోజు మద్యం, నగదు పంపిణీ చేసే అవకాశం లేకపోలేదు. చివరి రెండు రాత్రులు కీలకం కానున్నాయి. శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి ఈనెల 13 సాయంత్రం ఆరు గంటల వరకు 48 గంటల పాటు మద్యం దుకాణాలను మూసివేయనున్నారు. 13 సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరుగనుంది.

నేడు వనపర్తికి అమిత్‌షా రాక

వనపర్తి అర్బన్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి నేటితో తెరపడనుంది. చివరి రోజు శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి భరత్ ప్రసాద్ మద్దతుగా నిర్వహించనున్న బహిరంగ సభకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరు కానున్నారు. ఇప్పటికే పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఈ బహిరంగ సభ ఏర్పాట్లు కూడా పూర్తి అయ్యాయి. మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభమయ్యే ఈ బహిరంగ సభకు ఇప్పటికే ప్రాంగణమంతా భారీ లైటింగ్, సౌండ్ సిస్టం భారికేడ్లు, కుర్చీలు ఏర్పాటు చేశారు.

భార్యను చంపి భర్త ఆత్మహత్య

- వివాహేతర సంబంధం కొనసాగిస్తోందని ఘాతుకం

బిజినేపల్లి, మే 10 : వివాహేతర సంబంధం కొనసాగిస్తోందని భార్యను భర్త హత్యచేసి తానూ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం నాగర్‌కర్నూలు జిల్లా బిజినేపల్లి మండలంలో చోటుచేసుకున్నది. మృతుడి తమ్ముడు రామాంజనేయులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మంగనూరు గ్రామానికి చెందిన సంగనమోని వెంకటయ్య(43)కి ఇద్దరు భార్యలు ఉన్నారు. రెండో భార్య తారకమ్మ (35) అదే గ్రామానికే చెందిన ఓ వ్యక్తితో కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తోందని గుర్తించిన భర్త పలుమార్లు మందలించాడు. పెద్దలతో చెప్పించాడు. అయినా వివాహేతర సంబంధం కొనసాగిస్తోందని శుక్రవారం తెల్లవారు జామున 2 గంటల సమయంలో ఆమె తలను బలంగా బండకేసి బాది చంపేశాడు. భార్య తీవ్ర రక్తస్రావంతో మృతి చెందడంతో భయాందోళనకు గురైన వెంకటయ్య ఇంట్లో తాడు తీసుకొని వెళ్లి గ్రామ శివారులోని చింత చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు ఈ ఘటనను గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాలను పోస్టుమార్టం కోసం నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు భార్యలతోపాటు ఐదుగురు సంతానం ఉన్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగశేఖర్ రెడ్డి తెలిపారు.

నడిగడ్డకు న్యాయం చేస్తా

- నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లురవి

ఎర్రవల్లి మే 10 : పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆదరించి, నడిగడ్డకు న్యాయం చేసే అవకాశం కల్పించాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవి అన్నారు. ఎర్రవల్లి మండల పరిధిలోని కొండేరు గ్రామంలో శుక్రవారం ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉందని, దీంతో మన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఎన్నికల తర్వాత వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సంపత్‌కుమార్‌కు ప్రభుత్వంలో కీలక పదవి వచ్చేలా చూసే బాధ్యత తనదని చెప్పారు. అలంపూర్ నియోజకవర్గంలో పీజేపీ నీళ్ల సమస్య పరిష్కారం, తుమ్మిళ్ల మూడు రిజర్వాయర్ల నిర్మాణం పూర్తికి కృషి చేస్తానన్నారు. అంతకు ముందు కొండేరు స్టేజీ నుంచి గ్రామం వరకు కాంగ్రెస్ నాయకుడు సోమనాద్రి అధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు జోగుల రవి, ఇన్‌చార్జి సిరాజ్, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, నీలిశ్రీను, రాధమ్మ, జయచంద్రారెడ్డి, వెంకటేష్, ఇలియాస్, నారాయణనాయుడు, మద్దిలేటి, మధునాయుడు పాల్గొన్నారు.



కొండేరులో అంబేద్కర్, జగ్జీవన్ విగ్రహాలకు పూలమాల వేస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి, సంపత్

పాలమూరు రూపురేఖలు మారబోతున్నాయి

- రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

పాలమూరు, మే10 : రాబోవు రోజుల్లో పాలమూరు జిల్లా రూపు రేఖలు మారబోతున్నాయని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సుదర్శన్ ఫంక్షన్‌హాలులో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన గౌడ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 65ఏళ్ల తరువాత నేడు మన జిల్లా బిడ్డ రేవంత్‌రెడ్డికి ముఖ్యమంత్రిగా అయ్యే అవకాశం దక్కిందన్నారు. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించటంతో మనలను మనం గౌరవించుకోవాలన్నారు. భారత దేశానికి జీవన్మరణ సమస్య, తెలంగాణ ప్రజల చిరకాల కోరిక తెలంగాణ రాష్ట్రాన్ని సోనియమ్మ ఇచ్చిందన్నారు. తెలంగాణ ఇస్తే ఏపీలో కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకుపోతుందని తెలిసి, బెదరకుండా తెలంగాణ ఇచ్చిన సోనియమ్మకు మనం ఎంపీ పదవులను ఇవ్వటం మన కనీస బాధ్యత అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తూ, వ్యాపారం చేసుకుని బతుకుతున్నారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా భవిష్యత్‌కు సంబంధించిన ఎన్నికలని ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. మన జిల్లా నుంచి అధికంగా ఎమ్మెల్యే సీట్లు ఇవ్వటంతోనే మన జిల్లా మనిషి సీఎం అయ్యాడన్నారు. ఎంపీ సీట్లు సోనియమ్మకు అందిస్తేనే మన జిల్లాకు నిధుల వరద పారుతుందన్నారు. కళాశాలస్థాయి నుంచి ఎదిగిన నాయకుడిగా రాజకీయాల్లోకి వచ్చిన, ఎంపీగా గెలిస్తే మీవల్లేనని తెలిపారు. సమావేశంలో సత్తూరు చంద్రకుమార్‌గౌడ్, కుర్మయ్యగౌడ్, జిల్లాలోని గౌడ పెద్దలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజావ్యతిరేక మోదీ ప్రభుత్వాన్ని ఓడించండి

- తెలంగాణ జాగో-తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక నాయకులు

పాలమూరు, మే 10 : ప్రజావ్యతిరేక మోదీ ప్రభుత్వాన్ని ఓడించాలని తెలంగాణ జాగో-తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక పిలుపునిచ్చింది. తెలంగాణ జాగో - తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక (టీఎస్‌డీఎఫ్) ఆధ్వర్యంలో చేపట్టిన ఓటరు చైతన్య యాత్ర 10వ రోజు శుక్రవారం మహబూబ్‌నగర్‌కు చేరుకుంది. న్యూటౌన్, గడియారం చౌరస్తాలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో నాయకులు ప్రసంగించారు. టీఎస్‌డీఎఫ్ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్, మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి, సీపీఐ(ఎం.ఎల్)మాస్‌లైన్ ప్రతినిధులు ప్రసంగించారు. పదేళ్ల కాలంలో కార్మిక, వ్యతిరేక, రైతువ్యతిరేక, యువజన వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ విలువలను మోదీ ధ్వంసం చేస్తున్నారని తెలిపారు. రూ.15లక్షలు, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఓడిపోయే దశలో ముస్లిం వ్యతిరేక ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో పి.అరుణ్‌కుమార్, సి.వెంకటేష్, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, నైనాల గోవర్ధన్, మహేష్ ప్రదీప్, తిరుపతి, రచయిత స్కైబాబు, స్వరూప, కల్పన యాత్రలో పాల్గొన్నారు.



క్లాక్‌టవర్‌లో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

ఎట్టకేలకు స్వాతి అంత్యక్రియలు పూర్తి

నాగర్‌కర్నూల్ క్రైం, మే 10 : అత్తింటి వేధింపులతో గత మంగళవారం ఆత్మహత్యకు పాల్పడిన స్వాతి మృతదేహానికి ఎట్టకేలకు శుక్రవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. భర్త సతీష్‌రెడ్డితోపాటు అత్తమామల వేధింపులకు తమ కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు మృతదేహాన్ని అత్తవారి ఇంటి ముందు న్యాయం కోసం నాలుగు రోజులు ఆందోళన చేయగా శుక్రవారం కూతురు, కుమారుడి పేర ఆరెకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయడంతో అంత్యక్రియలు నిర్వహించారు. పెళ్లి సందర్భంగా తాము ఇచ్చిన 15తులాల బంగారం, మూడు లక్షల నగదును తిరిగి ఇవ్వాలని మృతురాలి బంధువులు డిమాండ్ చేయగా పెద్దల సమక్షంలో నెలరోజుల్లో ఇస్తామని ఒప్పుకున్నారు. దీంతో ఇరుకుటుంబ సభ్యులు కలిసి ఉయ్యాలవాడ శ్మశాన వాటికలో స్వాతి అంత్యక్రియలు నిర్వహించడంతో నాలుగు రోజుల నుంచి జరిగిన ఆందోళన సద్దుమణిగింది.

వృద్ధురాలిపై హత్యాయత్నం?

ఖిల్లాఘణపురం, మే10: వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం సోలీపూర్ గ్రామంలో వృద్ధురాలు మంగనూరు చంద్రమ్మపై శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నం చేశారు. బాధితురాలు చంద్రమ్మపై దాడి చేసి పదునైన వస్తువుతో చెవులు, గొంతుపై కోయడంతో తీవ్ర రక్తస్రావంతో గాయాలయ్యాయి. గురువారం రాత్రి బాధితురాలి కుమారుడు కురుమూర్తి హైదరాబాద్‌కు వెళ్లడంతో కోడలు అంజమ్మ ,మనుమలు ఇంటిలో నిద్రించగా చంద్రమ్మ కల్లు తాగి ఇంటి ముందు ఆరు బయట మంచంపై నిద్రమత్తులో ఉండగా శుక్రవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు గాయపరచడంతో రక్తపు మడు గులో పడి ఉన్నది. బాధితురాలి కోడలు రక్తపు మడుగు లో ఉన్న అత్తను చూసి ఇరుగుపొరుగు వారికి విషయం తెలిపింది. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ శ్రీహరి ఆధ్వర్యంలో సంఘటన స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన చంద్రమ్మను వైద్య చికిత్స నిమిత్తం వనపర్తి ఆసుపత్రికి తరలించారు. చంద్రమ్మను వనపర్తి ఆసుపత్రిలో సీఐ రాంబాబు పరామర్శించి వివరాలు సేకరించారు. కోడలు అంజమ్మ ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నామని ఎస్ఐ శ్రీహరి తెలిపారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి

పెద్దకొత్తపల్లి, మే 10 : వడదెబ్బకు గురై ఉపాధి కూలీ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని కల్వకోల్ గ్రామంలో చోటు చేసుకుంది. శుక్రవారం ఎంపీటీసీ మాజీ సభ్యుడు కేఏసయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కద్దాల బాలకృష్ణయ్య(45) ఉపాధి కూలీ బుధవారం ఉపాధి పనులు చేస్తుండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దాంతో అతడిని కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలకృష్ణయ్య గురువారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య ఇందిరమ్మ, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. ఉపాధి కూలీ కద్దాల బాలకృష్ణయ్య మృతి చెందిన విషయం డీఆర్‌డీఏ చిన్న ఓబులేష్, ఎంపీడీవో నాగేంద్రంకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నగదు పట్టివేత

బాలానగర్, మే 10: మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా గోనెగండ్లకు చెందిన బి.రాములు అనే వ్యక్తి వద్ద ఉన్న రూ. 53వేలు ఉన్నట్లు గుర్తించారు. దాంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తిరుపాజీ తెలిపారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ మహబూబ్‌నగర్ అధ్యక్షునిగా కె. ప్రసాద్ ఎన్నిక

మహబూబ్‌నగర్ టౌన్, మే 10 : 2024-25 సంవత్సరానికి గాను లయన్స్ క్లబ్ ఆఫ్ మహబూబ్‌నగర్ అధ్యక్షునిగా కె. ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా పి. సుదర్శన్, కోశాధికారిగా బుచ్చిబాబు, మెంబర్‌షిప్ ఛైర్‌పర్సన్‌గా సంజీవ్‌కుమార్ ఎన్నికయ్యారు. లయన్‌భవన్‌లో నిర్వహించిన ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా ఎం. రాం వ్యవహరించారు. అనంతరం సమావేశం నిర్వహించారు. ఎన్నికైన సభ్యులను అభినందించారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

- అల్‌ఫైజ్ అధ్యక్షుడు జహంగీర్‌బాబా

మహబూబ్‌నగర్ అర్బన్, మే 10 : ఓటు కలిగిఉన్న ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా అన్నారు. శుక్రవారం నమాజ్ అనంతరం రైల్వే స్టేషన్ మసీదు ఆవరణలో ఓటుహక్కుపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఓటు హక్కుతో మంచి నాయకులను ఎన్నుకుంటే మంచిపాలన అందిస్తారన్నారు. ఓటు తప్పక వేయాలని, ఓటింగ్ శాతం పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యాకుబ్, ఖలీద్‌నవీద్, సోహేల్ పాల్గొన్నారు.

ఎన్నికలపై కార్యదర్శులకు అవగాహన

గండీడ్, మే 10 : మండల అభివృద్ధి కార్యాలయంలో శుక్రవారం పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై ఆయా గ్రామాల గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో దేవన్న మాట్లాడుతూ ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల్లో అన్ని సౌకర్యాలు ఉండేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి వెంకటయ్య, ఎంపీవో శంకర్‌నాయక్, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

'బీఎస్‌పీ మద్దతు కాంగ్రెస్‌కే'

మహబూబ్‌నగర్ రూరల్, మే 10 : పార్లమెంట్ ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ మద్దతు కాంగ్రెస్ పార్టీకే ఇస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బోయ శ్రీనివాసులు, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి సంతోష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం బీఎస్పీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జిలతో చర్చించి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో వంశీచంద్‌రెడ్డికి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. వంశీచంద్‌రెడ్డి విజయానికి అందరూ శ్రమించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జీలు రామచందర్, నంద కిష్టప్ప, గంగాధర్, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

కల్లు దుకాణదారుల దాడి : వ్యక్తి మృతి

గండీడ్, మే 10 : సమీప గ్రామంలో కల్లు తెచ్చుకున్న వ్యక్తిపై దాడి చేయడంతో మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా... గండీడ్‌కు చెందిన అష్రఫ్ (28)కు ప్రతీ రోజు కల్లు తాగే అలవాటు ఉంది. సాయంత్రం గండీడ్‌కు సమీపంలో ఉన్న మరో గ్రామానికి వెళ్లి కల్లు తెచ్చుకున్నాడు. దీంతో మండల కేంద్రంలో కల్లు దుకాణం నిర్వాహకులు కోపంతో అష్రఫ్‌పై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. 108 వాహనానికి సమాచారం ఇవ్వగా వారు పరిశీలించగా, అప్పటికే అష్రఫ్ మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సీఐ గాంధీ నాయక్, ఎస్ఐ శేఖర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు. మృతునికి ముగ్గురు కూతుళ్లు, భార్య ఉన్నారు.

యువతి అదృశ్యం : కేసు నమోదు

మిడ్జిల్, మే 10 : జడ్చర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి గురువారం తెల్లవారుజాము నుంచి కనిపించడం లేదని ఆ యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రమోహన్‌రావు శుక్రవారం తెలిపారు. సదరు యువతి హైదరాబాద్ కాల్‌సెంటర్‌లో పనిచేసేదని, నాలుగు నెలలుగా ఉద్యోగం మానేసి ఇంటివద్దనే ఉంటోందని తెలిపారు. గురువారం రాత్రి ఇంట్లో అందరితో పాటు నిద్రించిన ఆ యువతి తెల్లవారుజాము నుంచి కనిపించకపోవడంతో శుక్రవారం యువతి తండ్రి తమకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.



టంకరలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

ఆలోచించి ఓటు వేయండి

- టంకరలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

హన్వాడ, మే 10 : పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు ఆవేశంతో కాకుండా, ఆలోచన చేసి ఓటు వేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని టంకర, బుద్దారం, కారంతండా, కొత్తపేట గ్రామాలలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందన్నారు. మన ఒక్క ఓటు రేవంత్‌రెడ్డి గౌరవాన్ని పెంచుతుందన్నారు. ఇన్నాళ్లు తెలంగాణలో బాగుపడ్డది ఎవరని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, మేము ప్రతీ ఒక్కరి సంతోషం కోసం పథకాలు అమలు చేసి ఆదుకుంటామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, ఉద్యోగాలు అందిస్తామని చెప్పారు. అందరూ మళ్లీ సహకరించి పార్లమెంట్ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో వంశీచంద్‌రెడ్డిని గెలించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీలది రాష్ట్రం, దేశంలో గాలిపోయిందని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు. ఆగస్టు వరకు రైతులకు రుణమాఫీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో మాజీ సర్పంచులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు ఎం. సురేందర్‌రెడ్డి, ఎస్‌పీ వెంకటేష్, సుధాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మహేందర్, మండల కోఆర్డినేటర్ వెంకటయ్య, నాయకులు కృష్ణయ్య, తిరుపతయ్య, వెంకటయ్య, చెన్నమ్మ, శ్రీను, యాదయ్య, రాజునాయక్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

13న పోలింగ్ ప్రశాంతంగా జరగాలి

- సాధారణ ఎన్నికల పరిశీలకుడు షెవాంగ్ గ్యాచో భూటియా

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), మే 10 : మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఈ నెల 13న జరుగనున్న ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఎన్నికల నియమ నిబంధనలను అనుసరించి నిర్వహించాలని సాధారణ పరిశీలకులు షెవాంగ్ గ్యాచో భూటియా అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం నుంచి ఎన్నికల వ్యయ పరిశీలకులు వరుణ్ రంగస్వామి, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ జి. రవినాయక్‌తో కలిసి వెబెక్స్ ద్వారా పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఏఆర్వోలు, పోలీస్ నోడల్ అధికారులు, ఎన్నికల నోడల్ అధికారులతో మాట్లాడారు. పోలింగ్‌కు ముందు 72 గంటల ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని అన్నారు. ఎన్నికల పోలింగ్‌కు కేవలం రెండు రోజుల సమయమే ఉన్నందున డబ్బు, మద్యం, ఉచిత కానుకల పంపిణీపై ఫిర్యాదులు వస్తాయని, క్షేత్ర స్థాయిలో ఎంసీసీ, ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి బృందాలు, పోలీసులు అప్రమత్తంగా ఉంటూ రాత్రి కూడా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద మెడికల్ టీంలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అన్నారు.



మాట్లాడుతున్న సాధారణ పరిశీలకుడు షెవాంగ్ గ్యాచో భూటియా

పోలింగ్ బృందాలు ఈవీఎంలు, పోలింగ్ మెటీరియల్ పంపిణీ రోజున పోలింగ్ కేంద్రం నుంచి స్ట్రాంగ్ రూమ్‌కు చేరేవరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్పీ హర్షవర్ధన్ మాట్లాడుతూ నేడు శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రచారం ముగుస్తుందని, 144 సెక్షన్ అమలులో ఉంటుందని అన్నారు. నియోజకవర్గంలో ఓటరు కాని, స్థానికేతరులు, బయటివ్యక్తులు ఉండకూడదని, లాడ్జీలు, కల్యాణ మండపాలు తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. మూడు కంపెనీల కేంద్ర సాయుధ బలగాలు చేరుకున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో నారాయణపేట జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్‌లు, ఏఆర్వోలు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

మానవతావాది బసవేశ్వరుడు

పాలమూరు, మే 10 : కులమతాలకతీతంగా సమాజసేవ చేసిన గొప్ప మానవతావాది బసవేశ్వరుడని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మహాత్మ బసవేశ్వర జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం బసవేశ్వరుడు సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జేపీఎన్‌సీఈ రవికుమార్, ఉమేష్, కార్తీక్, మల్లేష్, రమేష్ పాల్గొన్నారు.

● మాజీ మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం మహాత్మబసవేశ్వర జయంతి వేడుకల్లో పాల్గొని విగ్రహానికి పూలమాల వేశారు. లింగవివక్షను వ్యతిరేకించిన అభ్యుదయవాది అన్నారు. గంజి వెంకన్న, రవికిషన్, అనంతరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బసవేశ్వరుడి సేవలు మరువలేనివి

పాలమూరు : హిందూధర్మ స్థాపనలో మహాత్మ బసవేశ్వర మహరాజ్ సేవలు మరువలేనివని బీజేపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో బసవేశ్వరుడి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు.

సమసమాజ స్థాపనకు కృషి : ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మిడ్జిల్ : అన్ని వర్గాల ప్రజలను, అన్ని మతాలను సమానంగా చేసేందుకు కృషి చేసిన మహనీయుడు మహాత్మా బసవేశ్వరుడని, ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జడ్చర్ల పట్టణంలోని గుండప్ప కాంపౌండ్‌లో మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలను వీరశైవ లింగాయత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీరశైవలింగాయత్ సభ్యులు, రాష్ట్ర సంగీతనాటక అకాడమీ మాజీ ఛైర్మన్ శివకుమార్ బాద్మి, నాయకులు ముంద్రతి శివకుమార్, జీవన్, అమర్నాథ్, రవి శంకర్ బాద్మి, రజిని, గణేష్, అశోక్, సురేష్, పెంటయ్య, ధృవ, శశాంక్ ఉన్నారు.

● భూత్పూర్ : బసవేశ్వరుడు గొప్ప సంఘ సంస్కర్త అని, ఆయన సేవలు మరుపురానివని మునిసిపల్ ఛైర్మన్ బస్వరాజుగౌడ్ అన్నారు. బలిజ లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం భూత్పూర్ చౌరస్తాలో నిర్వహించిన బసవేశ్వరుడి జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మాజీ



బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, మాజీ సర్పంచ్ నారాయణగౌడ్, మురళీధర్‌గౌడ్, అశోక్‌గౌడ్, రామునాయక్ రాథోడ్, లింగాయత్ సంఘం నాయకులు నాగరాజు, కోరే ప్రభులింగం, రాజశేఖర్, ప్రభులింగం, జగదీష్, శివప్రసాద్, శివరాజు, ఓకార్, శివానంద్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

● కోయిలకొండ : మండలంలోని వీరభద్రస్వామి దేవాలయంలో బసవేశ్వర విగ్రహానికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బలిజ సంఘం రాష్ట్ర నాయకులు బస్వరాజ్, వీరభద్రస్వామి, ఆలయ నిర్వాహకులు రాజు, రాము పాల్గొన్నారు.

● గండీడ్ : మండల పరిధిలోని వెన్నాచేడ్ గ్రామంలో బసవేశ్వరుడి జయంతి సందర్భంగా శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగలక్ష్మి, శివమల్లప్ప, రామలింగం, నాగేంద్రకుమార్, రాంరెడ్డి, బాలయ్య, ఆశన్న, వెంకట్‌రెడ్డి, యువకులు పాల్గొన్నారు.

● చిన్నచింతకుంట : మండలంలోని చిన్న వడ్డెమాన్ గ్రామ సమీపంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో బసవజయంతి వేడుకలు లింగాయత్‌ల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో లింగాయత్ నాయకులు ప్రభులింగం, ఆత్మలింగం, వట్టెం శివకుమార్, రామలింగం, జగదీష్ పాల్గొన్నారు.

తెలంగాణను మోసగిస్తున్న పెద్దన్న, చిన్నన్నలు

- కార్నర్ మీటింగ్‌లో మాజీ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ

హన్వాడ, మే 10 : పెద్దన్న, చిన్నన్నలు కలిసి తెలంగాణను మోసం చేస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి మహమూద్‌అలీ అన్నారు. శుక్రవారం రాత్రి హన్వాడలో బీఆర్‌ఎస్ పార్లమెంట్ ఎన్నికల కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహమూద్‌అలీ మాట్లాడుతూ 420 దొంగ హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. ఝూటా మాటలను నమ్మిన ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కడితే ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేయలేదని ఆరోపించారు. మోదీ సర్కార్ రైతుల బోర్లకు కరెంట్ మీటర్లు పెట్టేందుకు ప్రయత్నించగా కేసీఆర్ వ్యతిరేకించారని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మొద్దని, ఇంటి పార్టీ బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించాలని కోరారు. త్వరలోనే పెద్ద మార్పు వస్తుందని, మన పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి మట్లాడుతూ సోయిలేని కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలకు ఓటు వేయొద్దని కోరారు. బీఆర్‌ఎస్‌కు అండగా నిలువాలని ఓటర్లను అభ్యర్థించారు. కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు పార్టీని విడువను అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మన అభ్యర్థి ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి పక్కా లోకల్ అని అతడిని ఖచ్చితంగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కరుణాకర్‌రెడ్డి, కొండ లక్ష్మయ్య, ఎంపీపీ బాలరాజు, నరేందర్, నాగన్న, జంబులయ్య, శ్రీనివాసులు, వెంకటయ్య, మాధవులు పాల్గొన్నారు.



హన్వాడ కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి. లక్ష్మారెడ్డి

మిడ్జిల్, మే 10 : కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆచరణకు సాధ్యం కాని మోసపూరిత హామీలతో గద్దెనెక్కారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం జడ్చర్ల పట్టణంలోని 25, 26, 27 మునిసిపల్ వార్డులలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి ఆరుగ్యారెంటీలు అమలయ్యాయని గొప్పలు చెబుతూ, ప్రజలను మరోసారి మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ దోరేపల్లి లక్ష్మీరవీందర్, వైస్ ఛైర్మన్ సారికరామ్మోహన్, కౌన్సిలర్లు జ్యోతి, లత, ఆలూరి శశికిరణ్, దేవా, నాయకులు రామ్మోహన్, బాదేపల్లి రంజిత్‌బాబు, పిట్టల మురళి, ఇంతియాజ్, కరాటే శ్రీను, శ్రీకాంత్, పరమటయ్య, విజయ్, సత్యం, శ్రీను ఉన్నారు.

మిడ్జిల్‌లో కార్నర్ మీటింగ్

తనను ఇతర పార్టీలలోకి వెళుతున్నానని ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి ప్రచారం



హన్వాడలో కార్నర్ మీటింగ్‌కు హాజరైన ప్రజలు

చేయడం సరికాదని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి. లక్ష్మారెడ్డి అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తు మల్లురవిని ఓడించేందుకు, తనకు తెలియకుండా తన గెలుపుకోసం వెండి నాణేలు పంచింది మరిచి తనపై అసత్యపు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపుకోసం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో లక్ష్మారెడ్డి మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని కారుగుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాండు, ఎంపీపీ సుదర్శన్, జడ్పీటీసీ శశిరేఖబాలు, నాయకులు బాల్‌రెడ్డి, జంగారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, ఎల్లయ్యయాదవ్, జగన్‌గౌడ్ ఉన్నారు.

మైనారిటీల సంక్షేమానికి కేసీఆర్ పెద్దపీట

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ : బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి మైనారిటీలను అన్ని రకాలుగా ఆదుకున్నారని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని తూర్పు కమాన్ జామియామసీదు దగ్గర మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముస్లిం సోదరుల మద్దతు కోరారు. కార్యక్రమంలో నాయకులు ఇంతియాజ్ ఇసాక్, అబ్దుల్ రహమాన్ పాల్గొన్నారు.

● నవాబ్‌పేట : బీఎస్పీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఎస్పీ నాయకులు గిరి, శివకుమార్, శరత్, స్వామి, కుమార్, సోను, నవీన్ తదితరులు మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో బీఎస్పీలో చేరారు. జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ మాడెమోని నర్సింహులు, రాంప్రసాద్, ప్రతాప్, మెండె లక్ష్మయ్య పాల్గొన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ వచ్చింది, కరువు తెచ్చింది : పల్లె రవి

దేవరకద్ర : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది, మళ్లీ కరువు వచ్చిందని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పల్లే రవికుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కార్యకర్తలతో, నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ దగ్గర ప్రచారం నిర్వహించి ఆయన మాట్లాడారు. కారు గుర్తుకు ఓట్లు వేసి ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, కర్ణంరాజు, ఆంజనేయులు, వెంకటేష్, బాలరాజు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న ప్రభుత్వం

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట, మే 10 : పేదల అభ్యున్నతి కోసం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం హామీలను నెరవేస్తున్నదని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10లక్షల మేరకు ఆరోగ్యశ్రీ వంటి గ్యారెంటీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీఛైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి, బీడీ ఫ్యాక్టరీల యజమానులు విష్ణువర్ధన్‌రెడ్డి, సోషైల్‌సేట్, అజీమ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సాగునీటి కల సాకారం చేస్తాం

- కోయిలకొండలో మూడు లిఫ్ట్‌ల ద్వారా సాగునీరు

- నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి



కొతలాబాద్‌లో ప్రజలను కలుస్తున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

కోయిలకొండ, మే 10 : కోయిలకొండ మండ లంలో సాగునీటి కల సహకారం చేయడమే ధ్యేయంగా పని చేస్తాన ని నారాయణ పేట ఎ మ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొతలా బాద్, మల్లాపూర్, సూ రారం, ఎల్లారెడ్డిపల్లి, అం కిళ్ల గ్రామాల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్ రెడ్డికి మద్దతుగా నిర్వహించిన ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. కోయిలకొండ మండ లంలోని దమాయపల్లి, గణపతిరాయుని చెరువు, చంద్రాసుపల్లి, ర్యాలంపాడు లిఫ్ట్‌ల ద్వారా మండలంలోని ప్రతీ చెరువుకు నీరు తీసుకొస్తామని తెలిపారు. మండల ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. హస్తం గుర్తుకు ఓటేసి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిం చాలని కోరారు. కార్యక్రమంలో నారాయణపేట కాంగ్రెస్ నాయకులు కే.శివకుమార్‌రెడ్డి, పీసీసీ లీగల్ కన్వీనర్ రాజేంద్రప్రసాద్‌గౌడ్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జి.రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై.విద్యాసాగర్‌గౌడ్, నాయకులు రవి నాయక్, శేఖర్, సత్యంగౌడ్, చరిత, సాయిరాంగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

దేశ సంక్షేమం కోసం ప్రార్థించండి

- జామియా మసీదు ప్రతినిధులు



హజ్‌యాత్రికులను సన్మానిస్తున్న దృశ్యం

మహబూబ్‌నగర్ అర్బన్, మే 10 : పవిత్ర జ్‌యాత్రలో దేశ సంక్షేమం కోసం ప్రార్థించాలని జామియా మసీదు అధ్యక్ష, కార్యదర్శులు అహ్మద్‌అలీ, మహ్మద్‌జకీ అన్నారు. శుక్రవారం జామీయ మసీదులో నమాజ్ అనంతరం హజ్ యాత్రకు వెళుతున్న 11 మంది హజ్ యాత్రికులను సన్మానించారు. రాష్ట్ర, జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా అల్లాను ప్రార్థించాలని కోరారు. కార్యక్రమంలో సయ్యద్ అమీనుద్దీన్, మహ్మద్ ఇసాక్, సయ్యద్ సుల్తాన్, మహ్మద్‌ఖలీం, సయ్యద్ అఫ్జల్, జహంగీర్ పాల్గొన్నారు.

మిడ్జిల్‌లో..

మిడ్జిల్ : బాదేపల్లి ఫజల్‌బండా వాడలో ఉన్న మజీద్‌లో శుక్రవారం ప్రార్థనల అనంతరం హజ్‌యాత్రకు వెళ్లే యాత్రికులను మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మజీద్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ మొయిజుద్దీన్ ఆధ్వర్యంలో హజ్‌యాత్రకు వెళ్తున్న బోతుసేద్, షరీఫ్‌చౌదరి, దావూద్, ఇస్మాయిల్, జాకీర్, అశ్వక్, నూర్‌మహమ్మద్, రజాఅత్తారి, ఖాజీమొహినొద్దీన్, కలామొద్దీన్, నబీబుద్దీన్, ఖలీల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఇమామ్ అబ్దుల్‌హమీద్, మొయిజొద్దీన్, అబ్దుల్ రషీద్, గౌస్, అజహర్, కయ్యూం, సలీం, మజార్, ఇక్బాల్, అబ్దుల్‌అలీం, మునీరొద్దీన్, జహంగీర్, సర్వర్, సర్దార్ ఉన్నారు.

జోరుగా ఎన్నికల ప్రచారం



జామియా మసీదు సమీపంలో మాట్లాడుతున్న రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ కొత్వాల్

మహబూబ్‌నగర్ అర్బ న్, మే 10 : మహబూబ్ నగర్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారం తుది దశకు చేరింది. శుక్రవారం కావటంతో పట్టణంలోని అన్ని మసీదుల వద్ద ఆయా పార్టీల నాయకుల తమ అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. జామియా మసీదు, షాసాబ్ గుట్ట, మదీన మసీదు, రైల్వేస్టేషన్ అల్‌కౌసర్, సిరాజుల్, మోటర్‌లైన్, వన్‌టౌన్ తదితర మసీదుల వద్ద కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేట్టారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మునిసిపల్ ఛైర్మన్ ఆనంద్‌గౌడ్, మాజీ మునిసిపల్ ఛైర్మన్ రాధాఅమర్ ప్రచారం చేస్తూ కాంగ్రెస్ మహబూబ్‌నగర్ లోక్‌సభ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. నాయకులు మక్సూద్ హుస్సేన్, వినయ్‌కుమార్ ఉన్నారు.

బీసీలను నట్టేట ముంచిన బీజేపీని ఓడించాలి

- కులగణనపై హామీ ఇచ్చిన కాంగ్రెస్‌ను గెలిపిద్దాం

- బీసీ పొలిటికల్ జేఏసీ ఛైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్

పాలమూరు, మే 10 : పదేళ్ల పాలనలో బీసీలను నట్టేటముంచి తీరని అన్యాయం చేసిన బీజేపీని ఓడించాలని బీసీ పొలిటికల్ జేఏసీ ఛైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు దేశవ్యాపితంగా ఇండియా కూటమికి బీసీలంతా స్వచ్ఛందంగా మద్దతు ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు. దేశంలో మొదటిసారి ఓబీసీ ప్రధానిగా మోదీ గుర్తింపు పొందారు కానీ, ఓబీసీ డిమాండ్లలో ఒక్కటీ పరిష్కారానికి నోచుకోలేదన్నారు. దేశంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే సామాజిక, ఆర్థిక సమగ్ర కులగణన అంశంపైనే మొదటి సంతకం చేసి బీసీ రిజర్వేషన్లను పెంచుతామని హామీ ఇచ్చిందని తెలిపారు. ఇండియా కూటమికిఇ బీసీలు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా నిలవాలన్నారు. సమావేశంలో గోనెల శ్రీనివాస్, దోమ పరమేష్, బండి మల్లేష్, సంపత్‌కుమార్, మహేందర్, మ్యాదరి రాజు పాల్గొన్నారు.

పీయూ విద్యార్థులకు డాక్టరేట్ ప్రదానం

పాలమూరు యూనివర్సిటీ, మే 10 : పాలమూరు యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేసిన విద్యార్థులకు పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్ డాక్టరేట్ పూర్తి చేసినట్లు శుక్రవారం పీయూ అధికారులతో కలిసి ప్రకటించారు. మైక్రోబయాలజీ విభాగంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి గైడ్‌గా 'అదోని చేతన మైక్రోబియాల్ ప్రొడక్షన్ ఆఫ్ పెక్టినసెస్ ఫ్రోం అస్పర్గిల్లస్ నైజర్ హర్ ఫ్రూట్ జూస్ క్లారిఫికేషన్, రైపినింగ్ అండ్ పిల్ డిగ్రెడేషన్' అనే అంశంపై పూర్తి చేశారు. అదే విధంగా డాక్టర్ కిశోర్ పర్యవేక్షణలో ఎం.శ్రీనివాసారావు 'అలివియేషన్ ఆఫ్ డ్రౌట్ స్ట్రెస్ ఇన్ క్యాప్సికమ్ అన్యుమ్ అండ్ సైమోపసిస్ టెట్రగోనోలోబా బై యూజింగ్ ప్లాంట్ గ్రోత్ ప్రమోటింగ్ బాక్టీరియా' అనే అంశంపై పీహెచ్‌డీని పూర్తిచేశారు.పూర్తి చేసిన థిసిస్‌ను అందజేస్తు అభ్యర్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ మధు సూదన్ రెడ్డి,కాకతీయా యూనివర్సిటీ నుంచి ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవరించిన డాక్టర్ శ్రీనివాస ముంజం, మైక్రోబయాలజి విభాగదిపతి డాక్టర్ శాంతిప్రియా,డాక్టర్ కిశోర్ అభ్యర్థులు పాల్గొన్నారు.